జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
భద్రాద్రి కొత్తగూడెం
బుధవారం | 26 | ఫిబ్రవరి | 2025 ◆ పేజీలు : 7

## ఆర్థిక అక్షరాస్యత - మహిళా సాధికారత

### గోడ పత్రికలను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్



*భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 25, ప్రజాజ్యోతి :*

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆదేశాల మేరకు "ఆర్థిక అక్షరాస్యత – మహిళా సాధికారత" పై ఫిబ్రవరి 24 నుండి 28 వ తేది వరకు వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ తెలిపారు. మంగళవారం రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చే ప్రచురించబడిన గోడ పత్రికలను

మిగతా 2 లో...




2 లో..

# మార్పుకై కసరత్తులు..

- జిల్లా అధ్యక్షుని ఎంపికపై బిజెపి కసరత్తులు
- ఆచితూచి అడుగు వేస్తున్న రాష్ట్ర అధిష్టానం
- గత అధ్యక్షుల తీరుతో జిల్లాలో పార్టీ విచ్ఛిన్నం ..
- రంగా కిరణ్ వ్యవహారంతో పూర్తిగా నిర్వీర్యం..
- ఈసారి తప్పటడుగు వెయ్యబోమంటున్న భాజపా..?

భద్రాద్రి జిల్లాలో బిజెపి నయా జిల్లా అధ్యక్షుల ఎంపికపై రాష్ట్ర అధిష్టానం కసరత్తులు చేస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే రాష్ట్రమంతా జిల్లా అధ్యక్షుల ఎంపిక ప్రక్రియ పూర్తి అయింది. ఒక్క భద్రాద్రి జిల్లాలో మాత్రం కొన్ని అనివార్య కారణాల వల్ల గత కొన్ని రోజులుగా జాప్యం జరుగుతుంది. అయితే ఇప్పటికే ఈ అంశంపై బిజెపి రాష్ట్ర అధిష్టానం ఓ నిర్ణయానికి వచ్చినట్టు తెలుస్తోంది.

◆ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ప్రజాజ్యోతి




## ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి : జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్

*భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 25, ప్రజాజ్యోతి :*

ఈ నెల 27న జరగనున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసామని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ తెలిపారు. మంగళవారం ఎమ్మెల్సీ ఎన్నికల ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో ఐడిఓసి కార్యాలయం సమావేశపు హాల్ లో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు మొత్తం 2022 మంది ఓటర్లు కాగా అందులో పురుషులు 1068 మంది మహిళలు 954 మంది ఉన్నారని తెలిపారు. ఓటు హక్కు కలిగిన ఉపాధ్యాయులు అందరూ 100% తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు. 23 మండలాలకు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు ఆయన తెలిపారు. నేడు కొత్తగూడెం శ్రీ రామచంద్ర డిగ్రీ కళాశాల నందు ఎన్నికల డిస్ట్రిబ్యూషన్

మిగతా 2 లో...

## పోలీసులు రికవరీ చేసిన 170 మొబైల్ ఫోన్లను బాధితులకు అందజేత

### అధికారులు,సిబ్బందిని ప్రశంసించిన జిల్లా ఎస్పీ రోహిత్ రాజు




*కొత్తగూడెం క్రైమ్ , ఫిబ్రవరి 25, ప్రజాజ్యోతి :*

సిఇఐఆర్ పోర్టల్ ద్వారా భాధితుల మొబైల్ ఫోన్లను జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో ఫోన్లను పోగొట్టుకున్న భాదితులకు సిఇఐఆర్ పోర్టల్ ద్వారా రికవరీ చేసి తిరిగి వారికి అందజేయడం జరిగిందని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు తెలియజేసారు. జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో

మిగతా 2 లో...

## ఔట్సోర్సింగ్ కార్మికుల అవస్థలు...

# పనులు ఫుల్... వేతనాలు నిల్




- 4 నెలలుగా వేతనాలు రాక వెతలు
- ఆర్థిక ఇబ్బందుల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ ఔట్సోర్సింగ్ కార్మికులు
- ఆర్థిక ఇబ్బందులు పడుతున్న వైనం
- ప్రభుత్వం నిధులు విడుదల చేయలేదంటూ కాలయాపన

*ఇల్లెందు, ఫిబ్రవరి 25, ప్రజాజ్యోతి :*

సాధారణంగా ఎవరైనా పని చేస్తేనే దానికి ప్రతి నెల వేతనం వస్తేనే తన కుటుంబాన్ని పోషించుకోవడం సర్వసాధారణం. ఎదో పని చేసిన వద్ద ఒక్క నెల వేతనం రాకపోతేనే కుటుంబ పోషణ ఎంతో భారంగా మారుతుంది. ఇంటి పెద్ద దిక్కుగా ఏమి చేయాలో అర్థం కాక ఆర్థిక పరిస్థితుల్లోకి వెళ్ళిపోతాడు. అలాంటిది ఏకంగా 4 నెలలుగా వేతనాలు రాకపోతే ఇక ఆ కుటుంబ పరిస్థితులు వర్ణనాతీతం. జిల్లాలో ఎస్సీ, ఎస్టీ, బీసీ హాస్టల్స్ లో పనిచేస్తున్న ఔట్సోర్సింగ్ కార్మికులకు 4 నెలలుగా వేతనాలు లేవని తెలుస్తుంది. నిత్యం వసతి గృహాల్లో విధులు నిర్వహిస్తున్న కార్మికులకు వేతనాలను ప్రతినెల అందించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందంటూ కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో ఎస్సీ, ఎస్టీ, బీసీ హాస్టల్స్ లో సుమారుగా

మిగతా 2 లో...

## ఆర్థిక అక్షరాస్యత - మహిళా సాధికారత

(మొదటి పేజీ తరువాయి...)

ఆయన ఆవిష్కరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఆర్థిక అక్షరాస్యత సమాజంలో ప్రతి ఒక్కరికీ అవసరమని ముఖ్యంగా మహిళలు ఆర్థిక వ్యవహారాల్లో అవగాహన కలిగి ఉండడం ద్వారా త్వరితగతిన ఆర్థిక ప్రగతి సాధించవచ్చు అన్నారు. మహిళల కోసం ఆర్థిక ప్రణాళిక, పొదుపు, నష్ట నివారణ చర్యలు, ఆర్థిక పరిపుష్టికి రుణాలు పొందడం తదితర అంశాలపై గృహిణులు, ఉద్యోగినులు, స్వయం ఉపాధి పొందాలనుకునే మహిళలకు, కళాశాల విద్యార్థినులకు అన్ని బ్యాంక్ శాఖలు, ఆర్థిక అక్షరాస్యత కేంద్రాల ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, స్వయం ఉపాధి పొందాలనుకునే మహిళలకు బ్యాంక్ అధికారులు విరివిగా రుణాలు ఇవ్వాలని కలెక్టర్ సూచించారు.ఈ కార్యక్రమంలో లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ రామిరెడ్డి, ఐడిఓసి మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి : జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్

(మొదటి పేజీ తరువాయి...)

సెంటర్ లో ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కు సంబంధించి సామాగ్రిని తీసుకొని అధికారులు వారికి కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు చేరుకోవాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల వద్ద త్రాగునీరు, పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్ లైట్లు , ఫ్యాన్లు ఖచ్చితంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని తహసిల్దార్లను ఆదేశించారు. పోలింగ్ కేంద్రాలలోకి ఓటర్లను ఓటర్ రికగ్నైజేషన్ సెంటర్ ద్వారా నిశితంగా పరిశీలించిన తర్వాతనే లోపలికి అనుమతించాలని ఆదేశించారు. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద ఒక ఏఎన్ఎం అత్యవసర వైద్య సహాయం అందించేందుకు అందుబాటులో ఉండాలని అధికారులను ఆదేశించారు. పోలింగ్ అనంతరం అధికారులు పోలింగ్ సామాగ్రిని నిర్దేశిత పద్ధతి ప్రకారమే ప్యాకింగ్ చేసి నేరుగా నల్గొండ రిసెప్షన్ సెంటర్ కు చేరవేయాలి అన్నారు. నల్గొండ రిసెప్షన్ సెంటర్లో ఎవరికైతే డ్యూటీ వేసిన అధికారులు 27వ తారీకు ఉదయమే అక్కడికి చేరుకోవాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల వద్ద 100 మీటర్ల లోపు ఎవరిని అనుమతించరాదని, అంటే పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన, జడ్పీ సీఈవో నాగలక్ష్మి, ఎలక్షన్ సూపర్డెంట్ ధారా ప్రసాద్, ఎన్ఐసి అధికారి సుశీల్ , సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పోలీసులు రికవరీ చేసిన 170 మొబైల్ ఫోన్లను బాధితులకు అందజేత



(మొదటి పేజీ తరువాయి...)

ఈ పోర్టల్ ద్వారా అందుకున్న ఫిర్యాదులతో బాధితులు కోల్పోయిన మొబైల్ ఫోన్లను కనిపెట్టడం జరిగితుందన్నారు. గత రెండు నెలల వ్యవధిలో మొబైల్ ఫోన్లను పోగొట్టుకున్న 170 మంది భాధితులకు మంగళవారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో తిరిగి వారి ఫోన్లను అప్పగించడం జరిగింది. మొబైల్ ఫోన్లను పోగొట్టుకున్న బాధితులు వెంటనే సిఇఐఆర్ పోర్టల్ లో ఆన్లైన్ ద్వారా అడిగిన అన్ని రకాల వివరాలను ఖచ్చితంగా నమోదు చేసుకుంటే సంబంధిత పోలీస్ స్టేషన్ నుండి తిరిగి వారి మొబైల్ ఫోన్లను ట్రాక్ చేసి కనిపెట్టడం జరుగుతుందని తెలియజేశారు. కావున ఎవరైనా తమ మొబైల్ దొంగిలించబడినా, పోగొట్టుకున్నా వెంటనే పోర్టల్ ద్వారా తిరిగి వారి మొబైల్ ఫోన్లను పొందవచ్చునని తెలిపారు. పోర్టల్ ద్వారా పోగొట్టుకున్న తమ మొబైల్ ఫోన్ వివరాలను పొందుపరిచి ఫిర్యాదు చేయగలిగితే అట్టి ఫోన్లను సులభంగా కనిపెట్టవచ్చని ఈ సందర్భంగా ఎస్పీ తెలిపారు. పోగొట్టుకున్న మొబైల్ ఫోన్ ను అవతల వ్యక్తి వినియోగించాలని ప్రయత్నించినప్పుడు మాత్రమే అట్టి మొబైల్ ను ట్రేస్ చేయగలమని అన్నారు. ఈ సందర్భంగా బాధితుల మొబైల్ ఫోన్లను కనిపెట్టి వారికి అందజేయడంలో కృషి చేసిన జిల్లా పోలీస్ అధికారులు, సిబ్బందిని ఎస్పీ అభినందించారు. అనంతరం వారికి ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్బి ఇన్స్పెక్టర్ నాగరాజు, ఐటి సెల్ ఇంచార్జి సీఐ నాగరాజు రెడ్డి ,ఐటి సెల్ సభ్యులు విజయ్ , నవీన్, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

# మార్పుకై కసరత్తులు..

- జిల్లా అధ్యక్షుని ఎంపికపై బిజెపి కసరత్తులు
- ఆచితూచి అడుగు వేస్తున్న రాష్ట్ర అధిష్టానం
- గత అధ్యక్షుల తీరుతో జిల్లాలో పార్టీ విచ్ఛిన్నం ..
- రంగా కిరణ్ వ్యవహారంతో పూర్తిగా నిర్వీర్యం..
- ఈసారి తప్పటడుగు వెయ్యబోమంటున్న భాజపా..?




*భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 25, (ప్రజాజ్యోతి):*

భద్రాద్రి జిల్లాలో బిజెపి నయా జిల్లా అధ్యక్షుల ఎంపికపై రాష్ట్ర అధిష్టానం కసరత్తులు చేస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే రాష్ట్రమంతా జిల్లా అధ్యక్షుల ఎంపిక ప్రక్రియ పూర్తి అయింది. ఒక్క భద్రాద్రి జిల్లాలో మాత్రం కొన్ని అనివార్య కారణాల వల్ల గత కొన్ని రోజులుగా జాప్యం జరుగుతుంది. అయితే ఇప్పటికే ఈ అంశంపై బిజెపి రాష్ట్ర అధిష్టానం ఓ నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. జిల్లా అధ్యక్ష హోదాలో కొనసాగిన గత అభ్యర్థులు అధిష్టానాన్ని మెప్పించేంతలా బాధ్యతను నిర్వర్తించలేక పోయారు. దీంతో అధిష్టానం కొత్త అభ్యర్థుల వైపు మొగ్గు చూపుతున్నట్లు సమాచారం. ఇప్పటి వరకు జిల్లా బాధ్యులుగా వ్యవహరించిన ఏ నాయకుడు కూడా పార్టీని స్థానికంగా బలపరచడంలో పూర్తిగా విఫలమయ్యారు. సుమారు ఐదేళ్ల పాటు ఈ హోదాలో కొనసాగిన భైరెడ్డి ప్రభాకర్ రెడ్డి ఆశించిన మేర పార్టీ క్యాడర్ ను నిలపలేక పోయారు. తదుపరిగా అ స్థానాన్ని కైవసం చేసుకున్న కోనేరు సత్యనారాయణ (చిన్ని) సైతం పూర్తిస్థాయిలో పార్టీ పట్ల విధేయత చూపలేకపోయారు. ఆ హోదాలో రెండేళ్లపాటు కొనసాగిన ఈయన ఎక్కువగా పార్టీ కార్యకలాపాలు నిర్వహించలేక పోవడం, కార్యకర్తలతో సత్సంభందాలు కొనసాగించక పోవడంతో పూర్తిగా విఫలం అయ్యారు. చివరగా బిఆర్ఎస్ పార్టీ తీర్థం పుచ్చుకుని, ప్రస్తుతానికి కాంగ్రెస్ లో కొనసాగుతున్నారు. కోనేరు చిన్ని తప్పుకున్న అనంతరం ఆ హోదాను కైవసం చేసుకున్న రంగాకిరణ్ ఆశించిన మేర పని చేయక పోగా.., ఉన్న క్యాడర్ ను సైతం విచ్ఛిన్నం చేసే దిశగా అడుగులు వేశారు. ఆయా మండలాలు, గ్రామస్థాయి నాయకులతో అనునిత్యం వివాదాలకు దిగుతూ కోపిష్టిగా పేరుగాంచారు.

చివరిగా ఓ గిరిజన మండల అధ్యక్షునితో దురుసుగా ప్రవర్తించి సొంత పార్టీ వారితోనే తన పై కేసును నమోదు చేయించుకునే స్థాయికి దిగజారారు. దీంతో జిల్లాలోపార్టీ క్యాడర్ పూర్తిగా నిర్వీర్యం అయ్యింది. రంగా కిరణ్ స్వతహాగా కాంట్రాక్టర్ కావడంతో అదే తరహా ఆర్థికపరమైన కుటిల బుద్ధిని పార్టీలో ప్రయోగించారని కార్యకర్తలు పెదవి విరుస్తున్నారు. పెట్టిన ప్రతి రూపాయికి పది రెట్లు లబ్ధి పొందేలా కార్యకలాపాలు నిర్వహించే వారిని అభిప్రాయపడుతున్నారు. దీంతో జిల్లాలో బిజెపి పార్టీ పూర్తిగా అంతరించి పోయే దశకు చేరుకుంది. అయితే జిల్లాలో పంచాయతీ, మండల స్థాయిలో కాషాయానికి బలమైన క్యాడర్ ఉన్న వారిని పూర్తి స్థాయిలో నిలుపగల జిల్లా అధ్యక్షులు లేక పోవడం బిజెపికి ప్రస్తుతానికి ఓ గండంలా మారింది. గత కొంతకాలంగా బిజెపి అధిష్టానం సైతం జిల్లాలో కష్టించి పనిచేసే వాళ్లను కాకుండా లాబింగ్ నాయకులకే పట్టం కట్టడంతో పార్టీకి విపరీతమైన కష్టాలు తెచ్చి పెట్టింది. రెండు, మూడు దశబ్దాలుగా పార్టీనే నమ్ముకుని కొనసాగుతున్న నేతలు జిల్లాలో ఎందరో ఉన్నా.. అధిష్టానం మాత్రం ఆ నాయకుల వైపు గత దశాబ్ద కాలంగా కన్నెత్తి చూడక పోవడంతో కార్యకర్తలు అసహనం వ్యక్తపరుస్తున్నారు. వాస్తవానికి బిజెపి పార్టీ సిద్ధాంతాలు ఇప్పుడున్న అన్ని రాజకీయ పార్టీల సిద్ధాంతాల కన్నా భిన్నంగా ఉంటుంది. ఇందులో వారసత్వ రాజకీయాలకు, పార్టీ మారుతున్న పైరవీకారులకు ఎక్కువగా చోటు ఉండదు. కేవలం పార్టీని నమ్ముకున్న వారికే అత్యధిక అవకాశం కల్పించే పార్టీగా భాజపాకు జాతీయ స్థాయిలో పేరుంది. కాని ఒక్క భద్రాద్రి జిల్లాలో మాత్రం దీనికి విరుద్ధంగా ఎంపిక జరుగుతోందని పలువురు అభిప్రాయపడుతున్నారు. దీని వల్లనే భాజపా పార్టీ జిల్లాలో అనుకున్నంత మేర విస్తరించలేక పోయిందని మండల స్థాయి నాయకులు కుండబద్దలు కొడుతున్నారు. దీంతో పార్టీకి కింది స్థాయిలో క్యాడర్ బలంగా ఉన్న జిల్లా వ్యాప్తంగా అది నిలుపుకోవడంలో భాజపా కష్టాలు పడుతుంది. అయితే ఇప్పటికే ఈ విషయాన్ని గ్రహించిన అధిష్టానం ఈ సారి ఆచితూచి అడుగులు వేసేందుకు సిద్ధమవుతోందని తెలుస్తుంది. లాబియింగ్ నాయకులకు కాకుండా పార్టీ కోసం తొలినాళ్ల నుండి కష్టించి పనిచేసి.. ఎప్పటికీ యాక్టివ్ గా ఉండే వాళ్లకి జిల్లా బాధ్యతలు అప్పగించేందుకు రంగం సిద్ధం చేస్తోంది. ఈ నేపథ్యంలో కొన్ని సామాజిక వర్గ సమీకరణాలను కూడా బిజెపి అగ్ర నాయకులు పరిగణలలో తీసుకోనున్నట్లు సంకేతాలు వెలవడుతున్నాయి. గత ఎంపికలో పూర్తిగా ఓసి సామాజిక వర్గాల సభ్యులకే పట్టం కట్టడంతో .. ఈ సారి వినూత్నంగా ఆలోచించి ఎస్టి సామాజిక వర్గానికి ఈ బాధ్యతలు అప్పగించే యోచనలో ఉన్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. అయితే భద్రాద్రి జిల్లా పూర్తిగా గిరిజన జిల్లా కావడంతో ఈ పరిణామం ఆ పార్టీకి అత్యంత లాభం చేకూర్చుతుందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం జిల్లాలో ఇతర పార్టీ అభ్యర్థులు సైతం ఎస్టి సామాజిక వర్గ బాధ్యులు కావడంతో ఇది పార్టీకి కలిసొచ్చే అంశంగా పలువురు భావిస్తున్నారు. అయితే కాంగ్రెస్ కు పోదాం వీరయ్య, బిఆర్ఎస్ కి రేగా.కాంతారావు పార్టీ జిల్లా బాధ్యులుగా ప్రస్తుతం వ్యవహరిస్తున్నారు. ఈ ఇరువురు ఎస్టి కోయ వర్గానికి సంబంధించిన నాయకులు కావడంతో.. బిజెపి కొంత వినూత్నంగా ఆలోచిస్తున్నట్లు తెలుస్తోంది. అదే ఎస్టి తెగకు సంబంధించిన గిరిజన అభ్యర్థితో ఈ స్థానాన్ని పూర్తిచేసేందుకు బిజెపి అధిష్టానం పరిశీలిస్తున్నట్లు సమాచారం. ఒకవేళ బిజెపి అగ్రనాయకులు ఈ తరహాలో నిర్ణయం తీసుకుంటే మిగతా పార్టీలకు కళ్లెం వేసినట్లేనని రాజకీయ పండితులు విశ్లేషించుకుంటున్నారు. బిజెపి నాయకులు ఇలాంటి నిర్ణయమే తీసుకుంటే కచ్చితంగా అది పార్టీకి కలిసి వచ్చే అంశంగానే పలువురు భావిస్తున్నారు. అయితే గతంలో కంటే ప్రస్తుత పరిస్థితుల్లో అధిష్టానం తీసుకునే నిర్ణయం జిల్లాలో పార్టీ భవిష్యత్తుపై ఆధారపడే అంశంగా మారింది. ఇప్పటికే జిల్లా అధ్యక్షులు ఎన్నికపై పార్టీ కసరత్తులు చేస్తున్న నేపథ్యంలో ఎలాంటి లాబింగ్ రాజకీయాలకు తావు లేకుండా ముందుకు వెళితేనే భద్రాద్రి జిల్లాలో పార్టీకి భవిష్యత్తు ఉంటుందని స్పష్టమవుతుంది. ఒకవేళ గతం తరహాలోనే తిరిగి తప్పటడుగులు వేస్తే భద్రాద్రి జిల్లాలో భాజపా పూర్తిగా అంతమైపోవడం ఖాయమని సంకేతాలు స్పష్టంగా వెలువడుతున్నాయి.

# పనులు ఫుల్ ... వేతనాలు నిల్

(మొదటి పేజీ తరువాయి...)

200 మంది కార్మికులు పనిచేస్తున్నారు. వేతనాలు ప్రతినెల అందించకుండా 4 నెలలకు, 6 నెలలకు ఒకసారి అందిస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని కార్మికులు వాపోతున్నారు. విధుల్లో నిత్యం బాధ్యతాయుతంగా పనిచేస్తున్న కార్మికులకు ప్రతి నెలా అందించాల్సిన వేతనాలు విషయంలో మాత్రం ప్రభుత్వం మాత్రం నిధులు విడుదల చేయకపోవడం వల్ల ఆ కుటుంబాలు అనేక ఇబ్బందులకు గురవుతున్నామని కార్మికులు పేర్కొంటున్నారు. నిత్యం హాస్టల్స్ లో వాచ్మెన్లు, కుక్ లు, అటెండర్లుగా పనిచేస్తున్నప్పటికీ, పనులు విషయంలో కార్మికులను అప్రమత్తంగా ఉంటున్న కానీ అధికారులు వారికి సజావుగా అందాల్సిన వేతనాలను తాత్సరం చేస్తూ ఏమాత్రం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేతనాలు రాక ఇప్పటికే 4 నెలలు కావడంతో అప్పులు చేసి బ్రతుకుతున్నామని, అప్పులకు వడ్డీలు సైతం కట్టలేని పరిస్థితుల్లో ఉన్నామని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### ప్రతి నెల వేతనాలు అందించేలా చూడాలి:

ఎస్సీ, ఎస్టీ, బీసీ హాస్టల్స్ లో పనిచేస్తున్న ఔట్సోర్సింగ్ కార్మికులకు ప్రతి నెల క్రమం తప్పకుండా వేతనాలు అందేలా ప్రభుత్వం చొరవ చూపాలని కార్మికుల కోరుకుంటున్నారు. ప్రతి నెల వేతనాలు సక్రమంగా ఇవ్వకపోవడం వల్ల అప్పులతో జీవితాలను వెల్లదిస్తున్నామని అంటున్నారు. ప్రభుత్వం కార్మికుల వేతనాల విషయంలోవెంటనే స్పందించి విడుదల చేయాలని అన్నారు. ఇప్పటికైనా సంబంధిత సంక్షేమ హాస్టల్స్ జిల్లా అధికారులు స్పందించి కార్మికులకు 4 నెలలుగా అందాల్సిన వేతనాలను వెంటనే విడుదల చేసి, తమను ఆర్థికంగా ఆదుకోవాలని వేడుకుంటున్నారు.

### ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కాలేదు: సాయిరాం, బీసీ వెల్ఫేర్ ఏజెన్సీ

ఔట్సోర్సింగ్ కార్మికులకు ప్రభుత్వం నిధులను విడుదల చేయమని, వేతనాలు చెల్లించలేకపోతున్నామని, ప్రభుత్వం నుంచి నిధుల విడుదల చేయాలని మేము సైతం అడుగుతూనే ఉన్నాం. ప్రభుత్వం నిధులు విడుదల చేసిన వెంటనే కార్మికుల ఖాతాల్లో జీతాలు జమ చేయడం జరుగుతుంది.

# చదువును ఇష్టపడి చదవాలి

**ఇల్లందు, ఫిబ్రవరి 25, ప్రజాజ్యోతి :**

విద్యార్థులు చదువును కష్టపడి కాకుండా ఇష్టపడి చదివితేనే ఉన్నత స్థాయిలో ఉంటారని ఇల్లందు డిఎస్పి ఎన్. చంద్రభాను, మున్సిపల్ కమిషనర్ సిహెచ్ శ్రీకాంత్, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ రామలింగేశ్వరరావులు పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని సాహితీ కళాశాలలో ఫేర్ వెల్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో ఉండాలని తెలిపారు. క్రమశిక్షణకు మారుపేరు సాహితీ జూనియర్ కళాశాల అని తెలిపారు. ప్రతి విద్యార్థి తల్లిదండ్రులు తమ పిల్లల పట్ల ఎన్నో ఆశలు పెట్టుకుంటారని, విద్యార్థులు వారి తల్లిదండ్రులను దృష్టిలో ఉంచుకొని



ముందుకు అడుగు వేయాలని సూచించారు. ముఖ్యంగా విద్యార్థుల తల్లిదండ్రులు వారి పిల్లల నడవడికలపై కొంత దృష్టి సారించాలని తెలిపారు. తల్లిదండ్రులు వారి పిల్లలకు సెల్ ఫోన్ ఇవ్వవద్దని కోరారు. సమయం అందరికీ ఒకేలా ఉంటుందని, విద్యార్థులు ఉన్నత శిఖరాలను చేరాలని, సమయం వృధా చేయకుండా చదువుపై దృష్టి పెట్టాలని సూచించారు. విద్యార్థులు మంచిగా చదివి, పరీక్ష సెంటర్ కు ముందుగానే చేరుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్లు యంసీ. నాగిరెడ్డి, కెవిస్సి సుధాకర్, యం. శ్రీనివాస్, కళాశాల ప్రిన్సిపాల్ గుజ్జర్లపూడి రాంబాబు, అధ్యాపక, అధ్యాపకేతర బృందం పాల్గొన్నారు.

## హామీల అమలు ఇదేనా...?

### ఉద్యోగ ఉపాధ్యాయులకు కోట్లలో బకాయి

### పెన్షనర్ల పట్ల నిర్లక్ష్యం....

### బిజెపి మండల అధ్యక్షుడు మాలోత్ గాంధీ నాయక్

**లక్ష్మీదేవిపల్లి, ఫిబ్రవరి, 25 ప్రజాజ్యోతి :**

ఉపాధ్యాయ ఉద్యోగుల పెన్షనర్ల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి అనుసరిస్తుందని లక్ష్మీదేవిపల్లి మండల బిజెపి అధ్యక్షుడు మాలోత్ గాంధీ నాయక్ ప్రభుత్వాన్ని విమర్శించారు. మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యార్థులకు ఫీజు రియంబర్స్, ఉద్యోగులకు రిటైర్మెంట్ బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు తర్వాత 14 ఏళ్ల పాలనలో ఏ వర్గం ప్రజలు కూడా సంతృప్తిగా బతకలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలు ఉద్దేశపూర్వకంగానే నిరుగారుస్తుందని ఆగ్రహం వ్యక్తం చేసారు. ప్రజలకు న్యాయం చేసే దిశగా వ్యవహరించట్లేదని మండిపడ్డారు. పెండింగ్ డిఏ లు, జిపిఎఫ్ బకాయిలు, మెడికల్ బిల్లులు, ఉద్యోగస్తులకు రొటీన్ గా వస్తున్న విషయమే కానీ వాటిని కూడా చెల్లించకపోవడం వల్ల ఉద్యోగస్తులకు, ఉపాధ్యాయులకు, కోట్లలో ప్రభుత్వం బాకీ పడ్డారని పేర్కొన్నారు.



అనంతరం బిజెపి ఎమ్మెల్సీ అభ్యర్థి సరోత్తమ్ రెడ్డి ప్రచారంలో భాగంగా కారుకొండ, సీతారాంపురం, రేగళ్ల, లక్ష్మీదేవిపల్లి మండలంలో సరోత్తమ్ రెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్ రావు, రాజేష్, రాము, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## కాంప్లెక్స్ స్థాయి బాలమేళా విజేత బొమ్మనపల్లి

**టేకులపల్లి, ఫిబ్రవరి 25, ప్రజాజ్యోతి :**

బొమ్మనపల్లి జిల్లా పరిషత్ హై స్కూల్ కాంప్లెక్స్ స్థాయి లో మంగళవారం జరిగిన బాలమేళాలో 13 పాఠశాలలు పాల్గొన్నాయి. కాంప్లెక్స్ స్థాయిలో మండల పరిషత్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల బొమ్మనపల్లికి ప్రథమ స్థానం లభించింది. బొమ్మనపల్లి హైస్కూల్లో జరిగిన ముగింపు కార్యక్రమంలో జడ్పిహెచ్ఎస్ బొమ్మనపల్లి స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం మంగీలాల్, కార్యదర్శి రమేష్ బాబు చేతుల మీదుగా పాఠశాల హెచ్ఎం జ్యోతిరాణి, అసిస్టెంట్ పద్మ, ఐఆర్పి టీచర్ నీరజ షారోన్ లు ఈ బహుమతిని స్వీకరించారు. అదేవిధంగా కాంప్లెక్స్ స్థాయి లో ద్వితీయ చింతలంక , తృతీయ గోప్యా తండాలకు బహుమతుల తో పాటు, తరగతుల వారీగా విజేతలకు బహుమతులను అందజేశారు. ఇండియన్ స్కౌట్ అండ్ గైడ్ ఫెలోషిప్ రాష్ట్ర కోఆర్డినేటర్ మహమ్మద్ ఖాసిం, భద్రాద్రి కొత్త గూడెం జిల్లా అధ్యక్షుడు లోగాని శ్రీనివాస్, ఎంపిపిఎస్ మంగ్యా తండా హెచ్ఎం వీరన్న,



13 పాఠశాలల హెడ్మాస్టర్లు, టీచర్లు, హైస్కూల్ టీచర్లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు . ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి విద్యార్థికి ఇండియన్ స్కౌట్ అండ్ గైడ్ ఫెలోషిప్(ఐఎస్ జిఎఫ్ )తరఫున సర్టిఫికెట్లను, టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ ను, మెమెంటోలను అందజేశారు. ఉత్తమ ప్రతిభ కనపరిచిన వారిని, అతిధులను శాలువాలతో సత్కరించారు.

# మహిళల సాధికారత సాధనే దేశాభివృద్ధి

### కొల్లి ఫౌండేషన్ అధ్యక్షురాలు కల్పనా చౌదరి

**లక్ష్మీదేవిపల్లి , ఫిబ్రవరి 25, ప్రజాజ్యోతి :**

సమాజంలో అన్ని రంగాల్లో మహిళలు పురుషులతో సమానంగా ధీటుగా నిలబడి మహిళల సాధికారత సాధించినప్పుడే దేశం త్వరితగతిన అభివృద్ధి చెందుతుందని కొల్లి ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్పనా చౌదరి అన్నారు. మంగళవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లక్ష్మీదేవిపల్లి మండలం రేగళ్లలో కొల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో అధునాతన కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించాయి. ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతం లో కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించి ఈ శిక్షణ ద్వారా గ్రామీణ ప్రాంత మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకుని కుటుంబాలను చక్కదిద్దుకోవాలని అన్నారు. కొల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో సమాజ సేవ కార్యక్రమాలు



చేపట్టి అన్ని వర్గాల ప్రజలకు ఫౌండేషన్ ద్వారా తన వంతు సహకారం అందిస్తున్నారని అన్నారు. అనంతరం ఈ ప్రారంభోత్సవానికి ముం దుగా మహిళలు గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొని ఆమెను పూలతో స్వాగతించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కో ఆర్డినేటర్ రూప్లానాయక్, ఖమ్మం జిల్లా ఇన్చార్జి మూడు సురేష్, బోబ్బెల రమేష్, భూక్య కిషన్, కొల్లి ఫౌండేషన్ కుటుంబ సభ్యులు గ్రామ పెద్దలు పాల్గొన్నారు .

## రెస్లింగ్ పోటీలో సత్తా చాటిన సెయింట్ జోసెఫ్ హైస్కూల్ విద్యార్థులు



**చుంచుపల్లి, ఫిబ్రవరి 25, ప్రజా జ్యోతి :**

జిల్లాస్థాయి రెజ్లింగ్, రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో గెలుపొందిన సెయింట్ జోసెఫ్ హై స్కూల్ విద్యార్థులను ప్రిన్సిపల్ బ్రదర్ రాజశేఖర్ రెడ్డి అభినందించారు. చుంచుపల్లి మండలం, ధన్బాద్ గ్రామపంచాయతీలో గల సెయింట్ జోసెఫ్ హై స్కూల్ నందు 7వ తరగతి చదువుతున్న వి హర్షవర్ధన్ అబ్దుల్ అయాన్ ఈ నెల 21న 3వ ఇంక్లెన్ స్పోర్ట్స్ గ్రౌండ్ , భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో నిర్వహించిన ఉమ్మడి జిల్లా వ్రెస్లింగ్ చాంపియన్ షిప్ 2025 పోటీల్లో మాస్టర్ వి హర్షవర్ధన్ 36 కె.జి ల విభాగంలో స్వర్ణం, మాస్టర్ అబ్దుల్ అయాన్ 36 కె. జి ల విభాగంలో రజత పతకం సాధించారు. 3వ తరగతి చదువుతున్న సి. హెచ్ జైదీప్ ఈనెల 23న ఎంపవర్మెంట్ సెంటర్, హనుమాన్ బస్తీ , భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో నిర్వహించిన ఉమ్మడి రాష్ట్ర (తెలంగాణ , ఆంధ్రప్రదేశ్ ) ఇన్విటేషనల్ ఓపెన్ కరేటే ఛాంపియన్ షిప్ 2025 పోటీల్లో మాస్టర్ సి. హెచ్ జయదీప్ కతా పోటీలో ( 8 సంవత్సరాల వయస్సు గ్రూప్ ) లో స్వర్ణం సాధించారు. ఈ సందర్భంగా స్కూల్ ప్రిన్సిపాల్ వీరిని అభినందించారు. అంతేకాకుండా రాబోయే రోజుల్లో జాతీయస్థాయి పోటీల్లో మరెన్నో పథకాలు సాధించాలని ఆశాభావం వ్యక్తం చేశారు.

## క్యాట్ ఒలింపియాడ్ లో శ్రీ చైతన్య స్కూల్ విద్యార్థుల ప్రభంజనం





**కొత్తగూడెం , ఫిబ్రవరి 25, ప్రజాజ్యోతి :**

స్థానిక భజనమందిర్ రోడ్ లో ఉన్న శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థులు క్యాట్ ఒలింపియాడ్ లో మంచి ఫలితాలతో ప్రభంజనం సృష్టించారు. సోమవారం వెల్లడించిన ఫలితాలలో పాఠశాలకి చెందిన 31 మంది విద్యార్థులు నగదుతో పాటు, బంగారు పతకాలు, ప్రశంస పత్రాలు గెలుచుకున్నారని పాఠశాల ప్రిన్సిపాల్ వి. యస్. ఎన్ మూర్తి తెలిపారు. 8వ తరగతికి చెందిన నక్క మెహల్ 2000 రూపాయల నగదు బహుమతి , 6వ తరగతికి చెందిన హర్ష ఉదయ రామ్, అలియా 1000 నగదు బహుమతి గెలిచినట్లు తెలిపారు. 28 మంది విద్యార్థులు బంగారు పతకాలు సాధించారు. ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం విద్యార్థులను , వారి తలితండ్రులను అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఏజీఎం జయప్రకాష్, కోఆర్డినేటర్ వెంకట్ , డీన్ రామకృష్ణ, సీ– ఇంచార్జి హరి కృష్ణ విద్యార్థులకు సర్టిఫికెట్స్ అందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయని ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# వ్యర్థాలను సమర్థవంతంగా నిర్వహించాలి : కలెక్టర్

కలెక్టర్ జితేష్ వి. పాటిల్

*భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 25,ప్రజాజ్యోతి :*





వ్యర్థాలను సమర్థవంతంగా నిర్వహించడం ద్వారానే మంచి పర్యావరణం, ఆరోగ్యం, ఆర్థిక ప్రయోజనాలు కలుగుతాయని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అన్నారు. నవభారత్ లోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ బాలికల పాఠశాల ను జిల్లా కలెక్టర్ మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంలో భాగంగా కలెక్టర్ విద్యార్థులతో కలిసి పాఠశాల అసెంబ్లీ లో పాల్గొని విద్యార్థులతో పాటుగా ప్రతిజ్ఞ చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాలలో అసంబ్లీ చేయు విధానాన్ని ప్రశంసించారు.వేస్ట్ మేనేజ్మెంట్ అనేది పర్యావరణం, ఆరోగ్యానికి ఎంతో ముఖ్యమని అన్నారు. వ్యర్థాలను సరైన పద్ధతిలో నిర్వహించకపోతే ఆరోగ్యం, పర్యావరణం పై ప్రతికూల ప్రభావం పడుతుందని ఆయన విద్యార్థులకు తెలిపారు. వ్యర్థాలను సేకరించడం, శుద్ధి చేయడం, పారవేయడం వంటి క్రమబద్ధమైన ప్రక్రియను వేస్ట్ మేనేజ్మెంట్ అంటారని తెలిపారు. ఈ వేస్ట్ మేనేజ్మెంట్ ద్వారా పర్యావరణ అనుకూల ఉత్పత్తులు, ప్రక్రియలను సృష్టించడమే కాకుండా కొత్త ఆదాయ మార్గాలు కూడా పెంపొందించవచ్చు అని తెలిపారు. వంటశాలలోని వ్యర్థాలనుండి కంపోస్ట్ పిట్ ద్వారా సేంద్రీయ ఎరువులను తయారు చేయవచ్చని విద్యార్థులకు తెలిపారు. విద్యార్థులు అందరూ పాఠశాలలో వ్యర్థాలను సరైన పద్ధతుల్లో నిర్వహించి పాఠశాలలో ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించేలా విద్యార్థులకు ఉపాధ్యాయులు అవగాహన కల్పించాలన్నారు. కంపోస్ట్ పిట్ లను ఉపయోగించడం వలన పర్యావరణానికి, మొక్కల పెరుగుదలకు, నేల సారవంతానికి ఎన్నో ప్రయోజనాలు చేకూరుతాయి అన్నారు. అదేవిధంగా మట్టి ద్వారా ఇటుకల తయారీ ప్రాధాన్యత, తయారీ గురించి విద్యార్థులకు కలెక్టర్ వివరించారు. పాఠశాల ఆవరణలో ఔషధ మొక్కలు, కూరగాయ మొక్కలను నాటాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భాగంగా మంగళవారం జన్మదినం జరుపుకుంటున్న పిల్లలకు పుస్తకాలు , పెన్నులను బహుకరించారు. రాష్ట్ర స్థాయి, జిల్లా స్థాయి కరాటే ఛాంపియన్షిప్ లో మొదటి స్థానంలో నిలిచిన విద్యార్థులను కలెక్టర్ అభినందించారు. పాఠశాల అభివృద్ధికి చేపట్టవలసిన పనులకు సంబంధించి నివేదికలు అందించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంలో కలెక్టర్ వెంట పాల్వంచ మున్సిపల్ కమిషనర్ సుజాత, పాఠశాల ప్రిన్సిపల్ మైథిలి, పాఠశాల, కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సంపన్న వర్గాలకు పెద్ద పీట వేస్తున్న కేంద్ర ప్రభుత్వం




*ఇల్లందు, ఫిబ్రవరి 25, ప్రజాజ్యోతి:*

సంపన్న వర్గాలకు పెద్ద పీట వేస్తూ సామాన్యులపై కేంద్ర ప్రభుత్వం పన్నుల మోత భారం మోపుతుందని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు కె. సారయ్య ఆరోపించారు. మంగళవారం స్థానిక విఠల్ రావు భవన్ లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. సామాన్యులు లేచినప్పటి నుంచి పడుకునే వరకు వాడే ప్రతి వస్తువుకు జిఎస్టీ పేరుతో పన్నులు కడుతూ రూ. లక్షల కోట్లను సమకూరుస్తుంటే సంపన్నులకు రాయితీలు ఇస్తూ రూ. లక్షల కోట్ల ధనాన్ని పెట్టుబడులుగా పెడుతూ, పేదవాడికి ఇచ్చే సాయాన్ని మాత్రం ఉచితాల పేరుతో ప్రచారం చేయడం తగదన్నారు. దేశంలో 120 కోట్ల మంది ప్రజలు కష్టపడుతుంటే సంపద అంతా కేవలం పదిమంది సంపన్నుల చేతుల్లో ఉందని, ప్రజా వ్యతిరేక విధానాలతో బడ్జెట్లను ప్రవేశపడుతూ, ప్రభుత్వ రంగ సంస్థలన్నీ ప్రైవేటుకరణ చేస్తూ కేంద్రం ఆదాయాన్ని వెతుక్కుంటుందని విమర్శించారు. ఓటేసే రూ. 1000 వైపు చూస్తే మీ భవిష్యత్తు అంధకారంలోకి పోయినట్లేనని పేర్కొన్నారు. పోడు భూములు, ఇల్లు లేని వాళ్ళ కోసం పోరాటం చేసింది కమ్యూనిస్టులే అన్నారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు దేవరకొండ శంకర్, పట్టణ కార్యదర్శి బందం నాగయ్య, జిల్లా సమితి సభ్యుడు, బ్రాంచ్ కార్యదర్శి యండి. నజీర్ అహ్మద్, మాజీ మున్సిపల్ వైస్ ఛైర్మన్ బాస శ్రీనివాస్ రావు, నాయకులు రాజారాం, కుమ్మరి రవీందర్, బొల్లి కొమరయ్య, కొరిమి సుందర్, చెరుకు సారయ్య, షేక్ వలి, కొత్తపల్లి సాంబమూర్తి, నెల్లి కొమరయ్య, కమటం చంద్ర, బందం లక్ష్మీ, అలుగు సరిత తదితరులు పాల్గొన్నారు.

## రెండు రోజు మద్యం దుకాణాలు బంద్




*టేకులపల్లి, ఫిబ్రవరి 25,ప్రజాజ్యోతి :*

తెలంగాణలో ఉమ్మడి ఖమ్మం, నల్గొండ, వరంగల్ జిల్లాల్లో ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ కొనసాగుతుంది.గ్రాడ్యుయేట్, టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికలు ఈ నెల 27న జరగనున్నాయి. ఈ క్రమంలో ఫిబ్రవరి 25 నుంచి 27 సాయంత్రం 4 గంటల వరకు మద్యం షాపులను ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మంగళవారం ఎక్సైజ్ అధికారులు సీల్ చేశారు. దీంతో ఎమ్మెల్సీ ఎన్నికలు జరగనున్న ఉమ్మడి జిల్లాల్లో రెండు రోజుల పాటు మద్యం షాపులతో కల్లు దుకాణాలు సైతం మూసివేయనున్నారు. కాగా 27 సాయంత్రం నాలుగు గంటల తర్వాత పోలింగ్ పూర్తవ్వగానే మద్యం షాపులు తిరిగి ఓపెన్ కానున్నాయి.

## ఆటోపై విరిగిపడిన చెట్టు

*టేకులపల్లి,ఫిబ్రవరి 25,ప్రజాజ్యోతి :*



ప్రయాణిస్తున్న ఆటోపై చెట్టు విరిగిపడటంతో ఆటో దెబ్బతిన్న నా ఘటన మండలంలో చోటు చేసుకుంది. బాధితుడు,స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం కొత్తగూడెం ఇల్లందు ప్రధాన రహదారిపై ఆటో వెళ్తే క్రమంలో అకస్మాత్తుగా బస్టాండ్ సెంటర్ ఏరియాలో చెట్టు పెద్దపెద్ద కొమ్మలు విరిగి ఆటో పై పడటం వల్ల ఆటో పూర్తిగా ధ్వంసం అయినది అని తెలిపారు.అదృష్టవశాత్తు ఆటోలో ఉన్న ఎవరికి ఎటువంటి ప్రమాదం జరగలేదని స్థానికులు తెలిపారు. కొద్దిసేపు ఆ ప్రాంతంలో ట్రాఫిక్కు అంతరాయం కలిగినది అని వారు తెలిపారు.

## ఆకస్మికంగా ప్రభుత్వ పాఠశాల తనిఖీ చేసిన ఎమ్మెల్యే కోరం కనకయ్య

*టేకులపల్లి, ఫిబ్రవరి25, ప్రజాజ్యోతి:*



టేకులపల్లి మండలం రోళ్లపాడు గ్రామంలో ఉన్నటువంటి ప్రభుత్వ పాఠశాలను మంగళవారం ఇల్లందు నియోజకవర్గ శాసనసభ్యులు కోరం కనకయ్య తనిఖీలు నిర్వహించి, పాఠశాలల్లోని విద్యార్థులకు పౌష్టిక ఆహారం, నిత్యం మెనూను అందిస్తున్నారా లేదని ఆరా తీసి ఎట్టి పరిస్థితుల్లో అశ్రద్ధ వహిస్తే కఠిన చర్యలు తప్పవని,పాఠశాల ప్రాంగణం ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని ఉపాధ్యాయులకు, విద్యార్థులకు తగుసూచనలు చేసారు .అనంతరం విద్యార్థులతో కాసేపు సరదాగా ముచ్చటించి విద్యార్థులు చదువుకొని ఉన్నత శిఖరాలు అవరోధించాలని వారు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు కోరం సురేందర్ , మండల నాయకులు ఈది గణేష్, బద్రు, ఖాన, లక్ష్మీనారాయణ, రాములు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ను విమర్శిస్తే ఖబర్దార్



*ఇల్లందు, ఫిబ్రవరి 25, ప్రజాజ్యోతి:*

సిపిఐ (యంఎల్ ) మాస్ లైన్ నేతలు కాంగ్రెస్ పార్టీ, ముఖ్యమంత్రి, మంత్రులను విమర్శిస్తే ఖబర్దార్ అని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బానోత్ రాంబాబు, మాజీ వైస్ యంపిపి మండల రాము, మండల అధ్యక్షుడు పులి సైదులు హెచ్చరించారు. మంగళవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ పేదల పార్టీ అన్నారు. గతంలో 5 సార్లు ఎమ్మెల్యేగా కొనసాగిన గుమ్మడి నరసయ్య ఏమి అభివృద్ధి చేశారో చెప్పాలని పేర్కొన్నారు. గతంలో సిసి రోడ్లు మంజూరు చేశారా అని ప్రశ్నించారు. గుమ్మడి ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో గ్రామాలను అంధకారంలోకి నెట్టి వేయడం జరిగిందని విమర్శించారు. గుమ్మడి గతంలో తన కుమార్తె ఎమ్మెల్యే టికెట్ కోసం బిఆర్ఎస్ నేతలను కలిశారని, ఆ పార్టీ ముందుండి గుమ్మడితో ప్రభుత్వాన్ని అబసుపాలు చేయాలని చూస్తున్నారని ఆరోపించారు. అసలు గుమ్మడి నరసయ్య మాస్ లైన్ పార్టీనా, బిఆర్ఎస్ పార్టీనా అనేది అర్థం కావడం లేదన్నారు. 2014లో కోరం కనకయ్య ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో సబ్ స్టేషన్ మంజూరు చేసినట్లు గుర్తు చేశారు. నియోజకవర్గాన్ని ఎమ్మెల్యే కోరం కనకయ్య అభివృద్ధి చేయలేదని, కాంగ్రెస్ హామీలు 420 అని విమర్శించడం ఏమిటని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని తప్పనిసరిగా అమలు చేయడం జరుగుతుందని స్పష్టం చేశారు. అసలు సీతారామ ప్రాజెక్ట్ కు బీజం వేసిందే కోరం కనకయ్య అన్నారు. గత ఎమ్మెల్యే వైఖరి వల్లనే సీతారామ ప్రాజెక్ట్ ఇల్లందు నియోజకవర్గానికి కాకుండా ఇతర ప్రాంతానికి తరలి వెళ్లినట్లు పేర్కొన్నారు. గతంలో ఎమ్మెల్యేగా ఉన్న కోరం కనకయ్య 21 ఇంక్లైన్ గనిని మూసి వేస్తే ప్రస్తుత మంత్రి తుమ్మల చొరవతో మరల తెరిపించడం జరిగిందన్నారు. కాంగ్రెస్ పార్టీ అన్ని వర్గాల అభ్యున్నతి కోరుకునే పార్టీ అన్నారు. ఏమైనా ఉంటే రాజకీయంగా ఎదుర్కోవాలే తప్ప సియం అపాయింట్మెంట్ ఇవ్వలేదని రాద్ధాంతం చేయవద్దని సూచించారు. నియోజకవర్గ సమస్యలు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లాలనే ఆకాంక్ష గుమ్మడి నరసయ్యకు ఉంటే ఎమ్మెల్యే కోరం కనకయ్య ద్వారా అపాయింట్మెంట్ ఇప్పించడం జరుగుతుందని, మాజీ ఎమ్మెల్యే నేరుగా వెళ్తే సియం ఎలా అపాయింట్మెంట్ ఇస్తారన్నారు. ఈ సమావేశంలో నాయకులు ఎట్టి హరికృష్ణ, అరేం కిరణ్, తాటి బిక్షం, ఆంజనేయులు, బండి ఆనంద్, పాయం స్వాతి, కల్తి పద్మ, దనసరి స్రవంతి, పలువురు నాయకులు పాల్గొన్నారు.

## బ్యాంక్ ఆఫ్ బరోడా సేవలను వినియోగించుకోవాలి

*ఇల్లందు, ఫిబ్రవరి 25, ప్రజాజ్యోతి:*



సింగరేణి సంస్థలో పని చేసే ఉద్యోగులు బ్యాంక్ ఆఫ్ బరోడా సేవలను వినియోగించుకోవాలని ఇల్లందు ఏరియా జియం వి. కృష్ణయ్య కోరారు. మంగళవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ బ్యాంక్ ఆఫ్ బరోడా నందు శాలరీ అకౌంట్ కలిగి ఉన్న అధికారులు, ఉద్యోగులకు బ్యాంక్ ఆఫ్ బరోడా వారు ప్రమాద బీమా కవరేజ్ పొడిగించారన్నారు. ఈ బీమా కవరేజ్ లో భాగంగా ఉద్యోగి వ్యక్తిగత ప్రమాదంలో మరణిస్తే రూ. 1 కోటి (డ్యూటీ లో మరణిస్తే 1.25 కోట్లు), యాక్సిడెంట్ డెత్ కవర్, జీతం ఖాతాకు లింక్ చేయబడిన రూపేయ్ డెబిట్ కార్డ్ పై కవరేజి రూ.2 లక్షలు, ప్రమాదంలో శాశ్వత వికలాంగుడైతే రూ. 1 కోటి, ప్రమాదంలో తాత్కాలిక వికలాంగుడైతే రూ. 75 లక్షలు ఇవ్వనున్నట్లు తెలిపారు. అదే విధంగా ఎయిర్ యాక్సిడెంట్ డెత్ కవర్ (డ్యూటీ లో లేనివారికి రూ.2 కోట్లు అలాగే డ్యూటీ లో ఉన్న వారికీ రూ. 2.25కోట్లు) గ్రూప్ ప్రమాద బీమా కవరేజ్ రూ.15 లక్షల వరకు వస్తాయని పేర్కొన్నారు.


# కాంగ్రెస్ బలపరిచిన గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థులకు మద్దతు ఇవ్వండి

**ఉమ్మడి ఖమ్మం జిల్లాలో గాంధీపథం క్యాడర్ 49,536**

**గాంధీపథం అధ్యక్షులు డాక్టర్ బుసిరెడ్డి శంకర్ రెడ్డి**

*భద్రాచలం టౌన్, ఫిబ్రవరి 25(ప్రజాజ్యోతి ):*

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో గాంధీపథం క్యాడర్ 49,536 ఉందని,నియోజకవర్గ నాయకులు మిమ్మల్ని ఉపయోగించుకుంటే కాంగ్రెస్ బలపరిచిన గ్రాడ్యుయేట్ యంయల్సీ అభ్యర్థులను గెలిపించుకోవచ్చని గాంధీపథం అధ్యక్షులు డాక్టర్ బుసిరెడ్డి శంకర్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో గ్రూపు రాజకీలు సహజమని, గతంలో కూడా గ్రూపు రాజకీయాలను గ్రూపు నాయకులను లెక్కచేయకుండా ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 10 నియోజకవర్గాల్లోని 46 మండలాల్లో 674 గ్రామ పంచాయతీలలో 49 వేల మంది గాంధీపథం క్యాడర్ను నిర్మించి కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేసి, 2009, 2014, 2018, 2023 కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపుకు కారణమయ్యమని, ఇప్పుడు కూడా ఉమ్మడి ఖమ్మం జిల్లాలో గాంధీపథం క్యాడర్ ను నియోజకవర్గ నాయకులు ఉపయోగించుకుంటే కాంగ్రెస్ బలపరిచిన గ్రాడ్యుయేట్ యంయల్సీ అభ్యర్థులకు మద్దతు ఇవ్వండని, లేదంటే ఆలోచించి మంచి అభ్యర్థిని బలపరచండని గాంధీపథం అధ్యక్షులు డాక్టర్ బుసిరెడ్డి శంకర్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. డా.వైయస్ మరణం తర్వాత 2015 సంవత్సరంలో మూడు పువ్వులు ఆరు కాయలుగా విరాలజీల్లుతున్న గ్రూపు రాజకీయాలపై విసుగు చెంది, కొంత మందిమి "ldూరపు కొండలు నునుపు అనుకుని ఇతర పార్టీల్లోకి వెళ్లినప్పటికీ, 2018 – 2023 సార్వత్రిక ఎన్నికల్లో తిరిగి కాంగ్రెస్ పార్టీకి పనిచే



యడం జరిగిందని, ఒక్క భట్టి విక్రమార్క తప్ప ఇప్పుడున్న మిగతా మంత్రులు , చాలామంది శాసనసభ్యు లు ఇతర పార్టీలలో టిక్కెట్లు దొరక్క కాంగ్రెస్ పార్టీలోకి వచ్చిన వారేననీ డాక్టర్ బూసిరెడ్డి పేర్కొన్నారు.మళ్లీ ఇప్పుడు ముచ్చటగా మూడు గ్రూపులుగా నాయకులు అధికారంలో ఉన్నప్పటికీ, ఇతర పార్టీల కంటే కాంగ్రెస్ పార్టీ మాత్రమే పేదల కోసం పాటుపడే పార్టీ అని డాక్టర్ బూసిరెడ్డి పేర్కొన్నారు.రాహుల్ గాంధీని ప్రధానమంత్రిగా చూడాలన్నదే మనందరి సంకల్పం అని, సుమారు 1980 విద్యార్థి దశ నుండి పదవులు రాకపోయినప్పటికీ దశాబ్దాల తరబడి కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం పని చేశమని,ఇప్పుడూ పదవుల్లో ఉన్న నాయకులు మిమ్ములను పట్టించుకున్నా పట్టించుకోకపోయినా పదవుల కోసం నాయకుల చుట్టూ తిరగకుండా కాంగ్రెస్ పార్టీ కోసం పని చేస్తామని డా.బూసిరెడ్డి తెలిపారు.తన వాగ్దాటితో తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని గెలిపించి తెలంగాణ రాష్ట్ర సర్వతోముఖ అభివృద్ధి కోసం కష్టపడుతున్న ప్రియతమ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గ నాయకత్వంలో మనందరం కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం ప్రభుత్వం చేపడుతున్న పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు పనిచేద్దామని గాంధీ పదం శ్రేణులకు డా.బూసిరెడ్డి శంకర్ రెడ్డి పిలుపిచ్చారు.

## పంట నష్టపరిహారంకై ఏవో కార్యాలయం ముందు ధర్నా

**రైతాంగాన్ని ఆదుకోవాలి అని**

**సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు డిమాండ్**

*టేకులపల్లి,ఫిబ్రవరి 25, ప్రజాజ్యోతి :*

గత రెండు రోజులుగా కురిసిన అకాల వర్షం వలన టేకులపల్లి మండలంలో సింగ్య తండా, లచ్చ తండా, మంగళ తండ, సుక్కాలబోడు,బద్దు తండా, నంద్యా తండా,బేతంపుడి మద్దిరాల తండా,తుమ్మల చేలక, వాగోడ్డు తండా, బి కాలనీ తండా తదితర గ్రామాలలో మొక్కజొన్న పంట తీవ్రంగా నష్టపోయిందని ఈ గ్రామాలలో సర్వే నిర్వహించి ఎకరానికి 50వేల రూపాయలు రైతాంగానికి నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ వ్యవసాయ శాఖ అధికారి కార్యాలయం ముందు అఖిలభారత రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా నిర్వహించి అనంతరం.ఏవో అన్నపూర్ణ కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఐఎఫ్టియు రాష్ట్ర నాయకులు డి ప్రసాద్ సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ మండల కార్యదర్శి కల్తి వెంకటేశ్వర్లు,ఏఐకేఎంఎస్ జిల్లా నాయకులు భూక్య హర్జ మాట్లాడుతూ మండలంలో పలు గ్రామాలలో కురిసిన తుఫాను వలన చేతి కందిన మొక్కజొన్న పంట నేలకొరిగిందని దీనితో ఆరుగాలం కష్టించి పెంచిన




మొక్కజొన్న రైతుకు దక్కకుండా అయిందని అన్నారు. వేలాది రూపాయలు పెట్టుబడిగా పెట్టి చేదోడు వాదోడుగా పంట చేతికి వస్తుందని ఆశించిన రైతుకి నిరాశ మిగిలిందని అన్నారు.. ప్రభుత్వం తక్షణమే సర్వే నిర్వహించి ఎకరానికి 50వేల రూపాయలు చెల్లించాలని డిమాండ్ చేశారు వ్యక్తిగత దరఖాస్తులతో రైతులు ఏవోకి సమర్పించడం జరిగిందని అన్నారు .సంబంధిత అధికారులు జోక్యం చేసుకొని పైన పేర్కొనబడిన పలు గ్రామాలలో సర్వే నిర్వహించి రైతుకి ధైర్యాన్ని ఇవ్వాలని వారు కోరారు .ఈ కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ మండల అధ్యక్ష కార్యదర్శులు ఏట్టి నరసింహారావు, గుగులోతు రామచందర్, నాయకులు భూక్య నర్సింగ్, మేకల వినోద్, ధరావత్ వెంకన్న, బిచ్చ,బోడా మంగీలాల్,బానోతు వెంకట్రాం రైతులు పాల్గొన్నారు.

# అక్రమంగా జామాయిల్ నరికించారు

**బాధితులు మాకు న్యాయం చేయండి**

**మమ్మల్ని చంపేస్తామని బెదిరిస్తున్నారు కాపాడండి సార్. !**

*టేకులపల్లి,ఫిబ్రవరి 25,ప్రజాజ్యోతి :*

గిరిజన నాయకులను అడ్డు పెట్టుకొని అక్రమంగా జామాయిల్ తోట నరికించిన కాంగ్రెస్ జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు ఏలూరి కోటేశ్వరరావు, కాంగ్రెస్ నాయకులు కొమరం చిట్టిబాబులు బెదిరిస్తున్నట్లు బాధితుడు మద్దిపాటి వెంకటేశ్వర్లు ఆయన కుమారుడు రవికుమార్లు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం టేకులపల్లి మండల కేంద్రం ప్రెస్ క్లబ్లో టేకులపల్లి మండలం సంపత్ నగర్ గ్రామానికి చెందిన మద్దిపాట్టి వెంకటేశ్వరరావు, రవికుమార్లు ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ టేకులపల్లి మండలం ఉమ్మడి గంగారం గ్రామ పంచాయితీ పరిధి సంపత్నగర్ గ్రామంలో గత 60సంవత్సరాలుగా సర్వే నెంబర్ 303/2/84లో 20ఎకరాల సాగు భూమి నా పేరుతో పట్టా ఉంది. అప్పటి నుంచి పంటలను పండిస్తు జీవనం సాగిస్తున్నాను. నా యొక్క వయస్సు రీత్యా గత కొన్ని సంవత్సరాల క్రితం జామాయిల్ తోట వేసుకున్నాను. ఇట్టి జామాయిల్ తోట మొదటి పంటను గత మూడు సంవత్సరాల క్రితం కోపించాను. రెండో కోత కోసం బేరగాళ్లను చూసే క్రమంలో చింతోనీ చెలాక గ్రామానికి చెందిన కాంగ్రెస్ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు ఏలూరి కోటేశ్వరరావు, కాంగ్రెస్ నాయకులు కొమరం చిట్టిబాబు ఈనెల 21వ తారీఖున 20 మంది కూలీలు పెట్టి నా జమాయిల్ తోటను నరికించి రెండు ట్రాక్టర్లతో తరలిస్తుండగా మేము వెళ్లి అడ్డుకోగా తరలిస్తున్న వ్యాపారి శంకర్ ఫోన్లో మాట్లాడుతూ గత సంవత్సరం క్రితం ఏలూరి కోటేశ్వరరావు 5 లక్షలకు ఈ తోటను అమ్మినట్లు తెలిపాడు. దీనిపై చిట్టి బాబుకు ఫోన్ చేయగా మీపై ఎస్సీ, ఎస్టి కేసు పెడతామని మీరు ఊర్లో నుండి ఎలా బయటకు వెళ్తారో అంతు చూస్తామని బెదిరించారు. మీ భూములు ఏజెన్సీ ఏరియా 1/70 యాక్ట్ లో ఉన్నాయని మిమ్మల్ని చంపినా దిక్కు లేదని మాకు మంత్రులు అండదండలు ఉన్నాయని బెదిరించాడు అని అన్నారు. వారిపై బోడు పోలీస్ స్టేషన్లో 22వ తారీకు కేసు పెట్టిన పోలీసులు పట్టించుకోలేదని 24వ తేదీన సాయంత్రం కేసు నమోదు చేశారు వారు తెలిపారు. జమయిల్ తోట అక్రమంగా నరికించిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని,దీనిపై ఉన్నతాధికారులు దృష్టి సారించి న్యాయం చేయాలని కోరారు.



## సీసీ రోడ్డునిర్మాణ పనులను ప్రారంభించిన కోరం సురేందర్



*టేకులపల్లి, ఫిబ్రవరి 25,ప్రజాజ్యోతి :*

టేకులపల్లి మండలం రోళ్లపాడు గ్రామం నందు మంగళవారం సీసీ రోడ్డునిర్మాణ పనులను జిల్లా కాంగ్రెస్ నాయకులు కోరం సురేందర్ ప్రారంభించారు .ఈ కార్యక్రమంలో నాయకులు ఈది గణేష్, చీమల లక్ష్మీనారాయణ, చీమల రాములు, ఖానా, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## జీవితంలో లక్ష్య సాధన కోసం కృషి చేయాలి



*ఇల్లందు, ఫిబ్రవరి 25, ప్రజాజ్యోతి:*

విద్యార్థులు జీవితంలో ఒక లక్ష్యాన్ని ఎంచుకొని దానిని సాధించేందు నిరంతరం కృషి చేయాలని ఇల్లందు యంపిడిఓ దన్ సింగ్ కోరారు. మంగళవారం మండలంలోని రొంపేడు ఎస్టి ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలు కష్టపడి చదివితేనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని పేర్కొన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు వారి పిల్లలకు సెల్ ఫోన్ కు దూరంగా ఉంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు భూక్యా పద్మ, డిప్యూటీ వార్డెన్ బానోత్ నాగేశ్వరరావు, ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## శివరాత్రి జాగరణకు తరలిరావాలి

*ఇల్లందు, ఫిబ్రవరి 25, ప్రజాజ్యోతి:*

మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని నేడు జెకె కాలనీ సింగరేణి క్రీడా మైదానం ( బ్లాక్ డైమండ్ స్టేడియం)లో ఎమ్మెల్యే కోరం కనకయ్య ఆధ్వర్యంలో జరగనున్న జాగరణకు ప్రజలు అధిక సంఖ్యలో తరలిరావాలని కమిటీ సభ్యులు తెలిపారు. మంగళవారం స్థానిక విలేకరులతో వారు మాట్లాడుతూ నేడు రాత్రి 7 గంటల నుంచి బుల్లితెర నటులు, జబర్దస్త్ ఫ్రేమ్ నటీనటులు, ప్రజా గాయకుడు, నల్గొండ గద్దర్ లతో మ్యూజికల్ నైట్ ఉంటుందన్నారు. ఎమ్మెల్యే కోరం కనకయ్య ప్రజలు పండుగను సంతోషంగా జరుపుకోవాలనే ఆలోచనతో ఖర్చుకు వెనకాడకుండా ఈ జాగరణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

## ఘనంగా బంధు శారద 4వ వర్ధంతి

*భద్రాచలం టౌన్, ఫిబ్రవరి 25(ప్రజాజ్యోతి ):*

భద్రాచలం పట్టణం లోని ఆల్ పెన్షనర్,రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ డివిజన్ కార్యాలయంలో ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ భద్రాచలం డివిజన్ అధ్యక్షులు బందు వెంకటేశ్వరరావు సతీమణి బంధు శారద 4వ వర్ధంతి మంగళవారం ఘనంగా నిర్వహించారు.ముందుగా బందు శారద చిత్రపటానికి అధ్యక్షులు బందు వెంకటేశ్వరరావు .జిల్లా గౌరవాధ్యక్షులు ఎంవీఎస్ఎస్ నారాయణ పూలదండలు వేసి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం సరోజినీ వృద్ధాశ్రమంలో శారద నాలుగవ వర్ధంతి సందర్భంగా 150 మంది వృద్ధులకు. వికలాంగులకు అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వారి కుమారుడు బంధు కిరణ్ కుమార్, కోడలు అనిత తదితరులు పాల్గొన్నారు.



## గ్రంథాలయమునకు కూలర్లు వితరణ



**భద్రాచలం టౌన్, ఫిబ్రవరి 25(ప్రజాజ్యోతి ) :**

మంగళవారం భద్రాచలం పట్టణం లోని తాతగుడి సెంటర్లో ఉన్న శాఖా గ్రంథాలయంనకు ఐటీసీ కాంట్రాక్టర్ పాకాల దుర్గాప్రసాద్, లయన్ డాక్టర్ గోళ్ళ భూపతి రావు లు ఆధ్వర్యంలో విద్యార్థులు ,వేసవి నీ ద్రుష్టి లో ఉంచు కొని స్థానికులు లైబ్రరీ లో ప్రశాంతంగా చదుకొనుటకు చల్లదనం కోసం రెండు కూలర్స్ వితరణ అందించారు. ఈ కార్యక్రమంలో దాతలు లయన్ డాక్టర్ గోళ్ళ భూపతి రావు మాట్లాడుతూ తనవంతుగా సేవా కార్యక్రమాలు చేయటం లో వున్న ఆనందం మరే ఇతర వాటిలో ఉండదని, పేదలను అనారోగ్యాలను, నిరాశ్రయులను ఆదరించటం మా భాద్యతగా నిర్వ హిస్తున్నామని భవిష్యత్తు లో ఇంకా ఈ గ్రంథాలయానికి కా వలసిన సహయ సహకారాలు అందిస్తామని తెలియచేశారు. అనంతరం గ్రంథ పాలకులు జాని మాట్లాడుతూ గ్రంథాలయంనకు దాతలు అందిస్తున్న సహాయ సహకారాలు మరువలేనివి అడిగిన వెంటనే స్పందించిన పాకల దుర్గాప్రసాద్, గోళ్ల భూపతి రావు కి ధన్యవాదాలు తెలిపారు. వీరు చేస్తున్నా సేవా కార్యక్రమాలు ఇలాగే కొనసాగాలని, మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమం లో కృష్ణార్జున రావు, భూషణ్ రావు,కడాలి నాగ రాజు, నాగేంద్ర ప్రసాద్, బిర్రు సుధాకర్( దుర్గా స్వీట్స్), విజయ గోపాల్, పుర ప్రముఖులు, విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం నర్సిరెడ్డిని గెలిపించాలి

**– టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రాజు**




**భద్రాచలం, ఫిబ్రవరి 25 (ప్రజాజ్యోతి ) :**

27న జరగనున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీపీటీఎఫ్, ఇతర ఉద్యమ సంఘాల బలపరుస్తున్న టీఎస్ యూటీఎఫ్ ఉద్యమ అభ్యర్థి అలుగుబెల్లి నర్సిరెడ్డిని ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం గెలిపించాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.రాజు కోరారు. పట్టణంలో టీఎస్ యూటీఎఫ్ ప్రాంతీయ కార్యాలయంలో యూటీఎఫ్ నాయకులు ఎస్.విజయ్ కుమార్ అధ్యక్షతన జరిగిన విలేకరుల సమావేశంలో టీపీటీఎఫ్ మాజీ నాయకులు రామాచారితో కలిసి మాట్లాడారు. 2019 మార్చి 22న జరిగిన ఉమ్మడి నల్గొండ, వరంగల్, ఖమ్మం ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎమ్మెల్సీగా అలుగుబెల్లి నర్సిరెడ్డి అత్యధిక మెజార్టీతో గెలుపొందారని, గెలిచిన నాటి నుంచి ఉపాధ్యాయుల మధ్యే ఉంటూ విద్యారంగ పరిరక్షణతో పాటు ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న అనేక సమస్యల పరిష్కారానికి పోరాటం నిర్వహించి విజయాలు సాధించారని గుర్తుచేశారు. 27న జరిగే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో నర్సిరెడ్డిని సీరియల్ నెంబర్ 4 మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షులు బి.మురళీమోహన్, ప్రధాన కార్యదర్శి ఎం.వెంకటేశ్వర్లు, టీపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి, యూటీఎఫ్ మండల అధ్యక్షుడు కొమర శ్రీనివాస్లు పాల్గొన్నారు.

## మహాశివరాత్రి పర్వదినం శుభాకాంక్షలు : ఐటీడీఏ పీవో రాహుల్

**భద్రాచలం, ఫిబ్రవరి 25 (ప్రజాజ్యోతి ) :**



ఆదివాసీ గిరిజన గ్రామాల్లో పనిచేసే ఉద్యోగులు, గిరిజనులు, గిరిజన కుటుంబాలు, గిరిజన విద్యార్థినీ, విద్యార్థులకు మంగళవారం ఐటీడీఏ పీవో రాహుల్ మహా శివరాత్రి పర్వదినం శుభాకాంక్షలు తెలిపారు. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని పరమశివుని కరుణాకటాక్షాలతో ఉద్యోగులు, ఆదివాసీ గిరిజన కుటుంబాలు సుభిక్షంగా ఉండాలని కోరారు.

# మర్కోడు కాంప్లెక్స్ లో బలమేళా కార్యక్రమం

**– ప్రతి పాఠశాలలోని విద్యార్థిని విద్యార్థుల మేధస్సు, నైపుణ్యత సృజనాత్మకతను వెలికి తీసేందుకు ఎఫ్ఎల్ఎన్ బాలమేళా కార్యక్రమం**

**ఎంఈఓ శాంతారావు**







**ఆళ్ళపల్లి. ఫిబ్రవరి25. ప్రజాజ్యోతి**

మంగళవారం మండల పరిధిలోని మర్కోడు కాంప్లెక్స్ స్థాయి ఎఫ్ఎల్ఎన్ బాలమేళా కార్యక్రమం సభాధ్యక్షులు కాంప్లెక్స్ హెచ్ఎం బాబులాల్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంఈఓ శాంతారావు పాల్గొని బాలమేళాను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... బాలమేళా కార్యక్రమం ద్వారా విద్యార్థులలో దాగి ఉన్నటువంటి సృజనాత్మకత, నైపుణ్య శక్తిని వెలికి తీయవచ్చని, వారన్నారు. తదనంతరం కాంప్లెక్స్ లోనే ప్రాథమిక పాఠశాలల విద్యార్థులు ఉపాధ్యాయులు పాల్గొని విద్యార్థుల సామర్థ్యాలు తెలుగు గణితం సైన్స్ సబ్జెక్టులలో, విద్యార్థులు ఉపాధ్యాయులు సమిష్టిగా తయారుచేసిన బోధనోపకర సామాగ్రిని ప్రదర్శించడం జరిగింది. విద్యార్థుల పర్ఫామెన్స్ లో కాంప్లెక్స్ లో కనబరిచిన పాఠశాలలగా మర్కోడు ఎంపీపీఎస్, ఆశ్రమ, సుద్దరేవు జిపిఎస్, యలక బంధం జిపిఎస్, కర్ణేగూడెం, చంద్రాపురం ఎంపీపీఎస్, జిపిఎస్ జిన్నెలగూడెం, నడిమిగూడెం, దొంగతోగు ఎంపీపీఎస్ పాఠశాలల విద్యార్థులకు ఉత్తమ ప్రతిభ కనపరచడంతో బహుమతి అందజేశారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన పాఠశాలగా మొదటి స్థానంలో కర్ణేగూడెం ఎంపీపీఎస్ రెండవ స్థానం లొద్దిగూడెం ఎంపీపీఎస్, మూడవ స్థానం జిపిఎస్ యలక బంధం పాఠశాలలను సెలెక్ట్ చేశారు. అలాగే విద్యార్థుల సామర్థ్యాలను ఉపాధ్యాయులు పనితీరును ఎంఈఓ అధికారి పాఠశాలకు గ్రేడులను ఇస్తూ ఉపాధ్యాయులకు ప్రశంసా పత్రాలను, విద్యార్థులకు బహుమతులు అందించారు. తదనంతరం మర్కోడు కాంప్లెక్స్ పరిధిలోని అడవి రామవరం పాఠశాలలో మూడు సంవత్సరాలు ఉపాధ్యాయ వృత్తి చేపట్టిన మూడు నెలలు కొనసాగిన. సత్యనారాయణ చారి ఉపాధ్యాయులు 317 జీవో ప్రకారం బదిలీలో భాగంగా ఖమ్మం జిల్లాకు బదిలీ కావడంతో వారిని కూడా ఉపాధ్యాయుల బృందం సన్మానం చేసి షీల్డ్ అందజేశారు. ఈ కార్యక్రమంలో టిపిటిఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు మైలారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు జోగా రాంబాబు, ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఈసం ముత్తయ్య, మర్కోడు ఎంపీపీఎస్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు అగ్గి రామకృష్ణ,నాగేశ్వరరావు, శ్రీనివాస్, మోహన్ బాబు, రాందాస్, ఇస్లావత్ హతిరాం, నరేష్, సురేష్, హరినాథ్, రమేష్, రేణుక, సమ్మక్క, బొజ్జా,రవి, బద్రు, రాజా, చందరావు, ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## రామాలయం గోశాలలో పశువైద్య శిబిరం



**భద్రాచలం, ఫిబ్రవరి 25 (ప్రజాజ్యోతి ) :**

పట్టణంలోని శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలోని గోశాలలో బైఫ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత పశువైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో పశువైద్యులు వలీబాబా గోశాలలో ఎదకురాని, చూడినిలవని పశువులను గుర్తించి 24 ఆవులకు గర్భకోశ వ్యాధులకు, సాధారణ వ్యాధులకు చికిత్సలు నిర్వహించారు. 28 దూడలకు నట్టల నివారణ మందులు తాగించారు. ఈ కార్యక్రమంలో ఐటీసీ బంగారు భవిష్యత్ పోగ్రాం ఎగ్జిక్యూటివ్ గీత ప్రవళిక, రామాలయం ఏఈవో భవానీరామకృష్ణ, గోశాల ఇన్చార్జ్ శ్రీనివాసరెడ్డి, సీనియర్ అసిస్టెంట్ సదయ్య, బైఫ్ సంస్థ క్షేత్ర అధికారి హరినాథ్, ఆనంట్లు పాల్గొన్నారు.

## భద్రాద్రి రామయ్యకు నిత్యకల్యాణం



**భద్రాచలం, ఫిబ్రవరి 25 ప్రజాజ్యోతి**

భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానంలో మంగళవారం సీతారాములకు అర్చకులు నిత్యకల్యాణం నిర్వహించారు. తెల్లవారుజామున స్వామి వారికి సుప్రభాతసేవ, ఆరాధన, అరగింపు, సేవాకాలం, నిత్యహోమాలు, నిత్య బలిహరణం తదితర నిత్యపూజలు నిర్వహించారు. గాలిగోపురానికి అభిముఖంగా ఉన్న ఆంజనేయస్వామివారికి ఉదయం పంచామృతాభిషేకం చేసి తమలపాకులు, సింధూరంతో పూజలు చేశారు. అనంతరం స్వామివారి నిత్యకల్యాణ మూర్తులను బేడా మండపానికి తీసుకువచ్చి నిత్యకల్యాణం నిర్వహించారు. కల్యాణంలో పాల్గొన్న జంటలకు ప్రసాదాలు, శేషవస్త్రాలు అందజేశారు.

# సైబర్ నేరాల పట్ల జాగ్రత్తలు వహించాలి

**ఇల్లందు, ఫిబ్రవరి 25, ప్రజాజ్యోతి:**




సైబర్ నేరాల పట్ల జాగ్రత్తలు వహించాలని ఇల్లందు ఐకెపి ఎపిఎం దుర్గారావు సూచించారు. మంగళవారం నాబార్డ్ సౌజన్యంతో సంఘాల సభ్యులు, ఎస్హెచ్జి లీడర్లు, పుస్తక నిర్వాహకులకు ఆర్థిక అక్షరాస్యతపై గ్రామస్థాయి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆర్థిక స్థిర త్వం,సామాజిక భద్రతా పథకాలు ద్వారా భవిష్యత్తు కోసం ప్రణాళిక వేసుకొని మెరుగైన జీవన నాణ్యతను పెంపొందుంచుకోవాలని సూచించారు. పంచ సూ త్రాలు, ఖాతాల డిజిటలైజేషన్, బ్యాంక్ రుణాలు పొందటం సామాజిక భద్రతా పథకాలు, ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజన, అటల్ పెన్షన్ బీమా యోజన సేర్పు ద్వారా సంఘ సభ్యులకు లోన్ ఇన్సూరెన్స్, ప్రమాద బీమా ఇన్సూరెన్స్, వడ్డీ లేని రుణాలు, మహిళా శక్తి కార్యక్రమాలు, రూపే కార్డుపై అవగాహన ఉండాలని కోరారు. ఈ కార్యక్రమం లో సీసీ లాలయ్య, ఎమ్మెస్ అకౌంటెంట్ నంద కుమారి, ఎఫ్ఎసి, సీఈవో ప్రగతి, దక్షిణ గంగోత్రి వివో అధ్యక్షురాలు మొగిలి కళ్యాణి, కార్యదర్శి వెంకటమ్మ, కోశాధికారి సువర్ణ, జయం గ్రామ సంఘం అధ్యక్షురాలు, రాధమ్మ, తారా గ్రామ సంఘం అధ్యక్షురాలు సరిత, కార్యదర్శి లతా, వివోఏలు మనోరమ, కోటమ్మ, మణి, భాస్కర్, స్వయం సహాయక సంఘాల సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# పూసుగూడెంలో ఘనంగా సేవాలాల్ జయంతి వేడుకలు

### ముఖ్యఅతిథులుగా పాల్గొన్న జిల్లా కలెక్టర్ జితిష్ వి పాటిల్, ఎమ్మెల్యే జారే ఆదినారాయణ



**ములకలపల్లి, ఫిబ్రవరి 25, ప్రజాజ్యోతి:**

శ్రీ సంత్ సేవాలాల్ జయంతి వారోత్సవాలలో భాగంగా సోమవారం మండలంలోని పూసుగూడెం గ్రామంలో భుక్యా శంకర్ నాయక్ అధ్యక్షతన సేవాలాల్ 286 వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా జిల్లా కలెక్టర్ జితిష్ వి పాటిల్, అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు, స్పెషల్ ఆఫీసర్ సుమలు హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ జితిష్ వి పాటిల్ మాట్లాడుతూ బంజారాలు సేవాలాల్ మహరాజ్ ఆశయాలకు అనుగుణంగా నడుచుకుంటూ సమాజంలో చదువులో ముందుండాలన్నారు. ఆస్తి పాస్తులు వెంట రావని, చదువు ఒక్కటే సమాజంలో మన విలువ లను పెంచుతుందన్నారు. సేవాలాల్ మహరాజ్ అడుగుజాడల్లో నడుస్తూ మొక్కలు నాటడం, మద్యపానానికి బానిసలు కాకుండా, స్త్రీలను గౌరవిస్తూ నాయక్ కార్ భారీ వ్యవస్థ ద్వారా ఆయన ఆశయాలను ముందుకు తీసుకువెళ్లాలని సూచించారు. బంజారా ధర్మ గురువు భానోతు భోజ్య నాయక్, సాధువులు తేజావత్ రాములు నాయక్, సక్రం నాయక్ లు బోగ్ బండారో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇస్లావత్ లక్ష్మణ్ నాయక్, ఎల్ హెచ్ పి ఎస్ రాష్ట్ర అధ్యక్షులు రాజేష్ నాయక్, రమేష్ నాయక్, ఎల్ఐసి లాలు, రాములు, డిఇ సక్రు, రమేష్ రాథోడ్, లు విశిష్ట అతిథులుగా హాజరయ్యారు. స్థానిక తహశీల్దార్ జి పుల్లారావు, అశ్వారావుపేట, అన్నపురెడ్డి పల్లి తహసీల్దార్లు కృష్ణ ప్రసాద్, జగదీశ్వర ప్రసాద్, ఎంపిడిఓ రేవతి, ఎంఇఓ సత్యనారాయణ, ఆర్ ఐ భద్రు, భుక్యా పత్తిలాల్, భుక్యా ధర్మ, బానోతు అమర్ సింగ్, నునావత్ రమేష్, భుక్యా భద్రు, జర్పుల తులసి రాం, భుక్యా నందా, గుగులోతు దేవేందర్, బానోతు హర్య, గుగులోతు శంకర్, బానోతు మల్లేష్, లావుడ్య దేశ్య, తేజవత్ భద్రు, తేజవత్ శ్రీశైలం, గుగులోత్ వీరన్న, గుగులోత్ చందు, తేజవత్ మాలు, బోడ శ్రీను, లవడియా అశోక్, బొడా చంద్రకళ, బిచ్చ, ప్రసాద్, చింటూ, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.





## పోలీసువారి ఆధ్వర్యంలో మండల స్థాయి వాలీబాల్ పోటీలు



**చర్ల,ఫిబ్రవరి 25 (ప్రజా జ్యోతి )**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలానికి చెందిన వాలీబాల్ క్రీడాకారులకు, చర్ల పోలీస్ శాఖ వారి ఆధ్వర్యంలో జరగబోయే వాలీబాల్ టోర్నమెంట్ కు క్రీడాకారులకు ఆహ్వానం పలుకుతున్నారు. చర్ల మండల కేంద్రంలోని పోలీస్ శాఖ ఆవరణలో మార్చి 5 6 7 తేదీలలో జరగబోయే వాలీబాల్ టోర్నమెంట్ కు మండలానికి చెందిన వాలీబాల్ క్రీడాకారుల నుండి ఎంట్రీలను ఆహ్వానిస్తోంది. ఈ పోటీలలో పాల్గొనబోయే క్రీడాకారులు స్థానికులై ఉండాలి, ప్రతి ఒక్కరికి ఆధార్ కార్డు తప్పనిసరి. ఒక టీం లో పాల్గొన్న వ్యక్తి మరొక టీంలో పాల్గొనకూడదు. ఏ గ్రామం పేరు మీద ఎంట్రీ నమోదు అవుతుందో ఆ గ్రామములోని క్రీడాకారులు మాత్రమే పాల్గొనాలని పోలీస్ వారు తెలిపారు. క్రీడాకారులు తమ ఎంట్రీలను మార్చి 4వ తేదీ సాయంత్రం వరకు ఈ క్రింది నంబర్ల వద్ద నమోదు చేయించుకోవాల్సిందిగా వారు తెలిపారు టి. నాగరాజు 9573780188 , కే.రవీంద్ర 7095344143 ఎన్.నరేష్ 8179841633 , ఈ పోటీలలో పాల్గొని ఒక్క లీగ్ మ్యాచ్ నైనా గెలిచినట్లయితే ఆ టీము వారికి వాలీబాల్ మరియు నెట్ అందజేయబడుతుంది. ఈ పోటీలలో ప్రథమ ద్వితీయ తృతీయ బహుమతులు ఉంటాయని, గెలిచిన వారికి నగదుతో పాటు షీల్డు అందజేయబడినని వారు తెలిపారు.

# నిర్మాణ పనుల్లో నాణ్యతాప్రమాణాలు పాటించాలి







### జిల్లా కలెక్టర్ జితిష్ వి పాటిల్

**ములకలపల్లి, ఫిబ్రవరి 25, ప్రజాజ్యోతి :**

మండలంలో జిల్లా కలెక్టర్ జితిష్ వి పాటిల్ సోమవారం విస్తృతంగా పర్యటించారు. ముందుగా మాధారం గ్రామంలో ఆదివాసీ కొయ్య బొమ్మల తయారీ కేంద్రాన్ని సందర్శించారు. అనంతరం రామాంజనేయపురం గ్రా మంలో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న మట్టి ఇటుకల కేంద్రాన్ని పరిశీలించా రు. మండల కేంద్రంలో ని ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనాల మరమ్మత్తు, మంగపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రహరీ గోడ నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. నిర్మాణ పనులలో నాణ్యతాప్రమానాలు పా టించాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. స్థానికులకు ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో మట్టి ఇటుకల తయారీ కేంద్రం నెలకొల్పి, ప్రహరీ నిర్మాణం చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెం ట స్థానిక తహశీల్దార్ గుడ్ల పుల్లారావు, ఎంపిడిఓ రేవతి ఎంపిఓ లక్ష్మయ్య, ఆర్ ఐ భద్రు, పంచాయతీ రాజ్ డిఇ , ఏఇ సురేష్ తదితరులు పాల్గొన్నారు.